ప్రజాశక్తి

గురువారం 18 సెప్టెంబర్ 2025 5 విజయనగరం



19న ఎంప్లాయీస్ గ్రీవెన్స్

కలెక్టర్ రామసుందర్‌రెడ్డి



ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఈనెల 19న శుక్రవారం ఉద్యోగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిపారు. ఉద్యోగులు తమ సమస్యలపై ఈ గ్రీవెన్స్‌లో దరఖాస్తులను అందజేయ వచ్చునని సూచించారు. ఇకనుంచీ ప్రతినెలా 3వ శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.



విజయనగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికసంఘాల నాయకులు;



ఆటో, క్యాబ్ డ్రైవర్లు: మయూరి జంక్షన్‌లో మానవహారం చేస్తున్నకార్మికులు

కదంతొక్కిన ఆటో, టాటా మేజిక్ కార్మికులు

● బంద్ విజయవంతం ● నగరంలో భారీ ర్యాలీ ●రూ.25వేలు ఆర్థిక సాయం చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉచిత బస్సు పథకంతో నష్టపోతున్న తమను ఆదుకోవాలని, ప్రభుత్వం రూ.25వేలు ఆర్థిక సాయం అందించాలని, రవాణాశాఖ అధికారుల వేధింపులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఆటో, టాటా మేజిక్ కార్మికులు బుధవారం చేపట్టిన బంద్ విజయవంతమైంది. జిల్లా వ్యాప్తంగా ఆటోలన్నీ నడపకుండా ఎక్కడికక్కడ ర్యాలీలు చేపట్టారు. విజయనగరంలో ఆటో, టాటా మేజిక్ వాహనాలు బంద్ చేపట్టారు. దీంతో ప్రయాణీకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బంద్ సందర్భంగా సిఐటియు, ఎఐ ఎఫ్‌టియు (న్యూ), ఎఐటియుసి ఆధ్వర్యంలో స్థానిక కోట జంక్షన్ నుంచి బాలాజీ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా మయూరి జంక్షన్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. బంద్ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.సురేష్, కోశాధికారి ఎ.జగన్మోహనరావు, ఎఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పండా, రెడ్డి నారాయణరావు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రంగరాజు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన ఉచిత బస్సు పథకం వల్ల ఆటో, టాటా మేజిక్ క్యాబ్ డ్రైవర్లు రోడ్డున పడ్డారన్నారు. వారికి ప్రత్యామ్నాయం కల్పించి రూ. 25వేలు ఇవ్వాలనిఇ డిమాండ్ చేశారు. జి.ఒ. నెం. 21, ఇ-చలానాలు రద్దు చేయాలన్నారు. ఆర్‌టిఒ వేధింపులు ఆపాలన్నారు. ఆటో, టాటా మేజిక్ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలనిఇ డిమాండ్ చేశారు. గ్రీన్ ట్యాక్స్, టోల్ ట్యాక్స్ రద్దు చేయాలన్నారు. ఓలార్. ఓబర్, ర్యాపిడో వంటి యాప్‌లు రద్దు చేసి, ప్రభుత్వమే యాప్ పెట్టాలన్నారు. లైసెన్స్ ఉన్న ప్రతి డ్రైవరుకు షరతులు లేకుండా వాహనమిత్ర అమలు చేయాలన్నారు. బంద్ లో కార్మిక సంఘాల నాయకులు బి.సూర్యనారాయణ, అప్పలరాజు రెడ్డి, అధిక సంఖ్యలో ఆటో, టాటా మేజిక్ కార్మికులు పాల్గొన్నారు. అంతకు ముందు కోట జంక్షన్ లో మానవహారం చేపట్టారు.

ఆటో రంగ కార్మికులను ఆదుకోవాలి

నెల్లిమర్ల : ప్రభుత్వం ఆటో రంగ కార్మికులను ఆదుకొని ఉపాధి చూపించాలని సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. జరజాపు పేట, మొయిద జంక్షన్, రామతీర్థంలో స్థానిక ఆటో కార్మికులు బంద్ పాటించారు. ఈ సందర్భంగా వారికి సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు మద్దతు పలికారు. ఆటో కార్మికులు వై.సన్యాసి, జి.గంగరాజు, బి.సూర్య, బి.సోంబాబు,ఎం.అప్పన్న, పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: మండల కేంద్రంలో సిఐటియు మద్దతుతో ఆటో కార్మికులు నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. స్థానిక 3 రోడ్ల జంక్షన్ వద్ద సిఐటియు నాయకులు బలస శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో లోకేష్, సంజీవ్, గంగయ్య, వెంకటరమణ, సోములు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: ఆర్థికంగా చితికపోతున్న ఆటో కార్మికులను, మేజిక్ క్యాబ్‌ల కార్మికులను తక్షణమే ఆదుకోవాలని సిఐటియు నాయకులు అంబళ్ల గౌరినాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చీపురుపల్లిలో సిఐటియు ఆధ్వర్యంలో ఆటో కార్మికులు, మేజిక్ క్యాబ్‌లు తలపెట్టిన భారీ ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. చీపురుపల్లి ఆటో స్టాండ్‌లో ప్రారంభమై ర్యాలీ మూడు రోడ్ల కూడలి మీదుగా గాంధీ బొమ్మ జంక్షన్, అంబేద్కర్ జంక్షన్, అల్లూరి సీతారామరాజు జంక్షన్, ఆంజనేయపురం వరకు సాగింది.

బొబ్బిలి: ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల బంద్‌లో భాగంగా ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆటో స్టాండ్‌లో నిరసన తెలిపారు. ఆటో కార్మికుల సమస్యలు పట్టించుకొకపోతే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

శృంగవరపు కోట: పట్టణంలోని దేవి జంక్షన్ నుండి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. సిఐటియు, ఎఐటియుసి, ఆటో యూనియన్ నాయకులు, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



చీపురుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో, క్యాబ్ డ్రైవర్లు

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం

రణభేరిలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు

ప్రజాశక్తి-బొబ్బిలి, రామభద్రపురం, విజయనగరం టౌన్, శృంగవరపుకోట

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల ఆర్థిక, విద్యా రంగ సమస్యలు పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్.మురళీమోహన్, కిషోర్, కోశాధికారి రెడ్డి మోహనరావు, రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, డి.రాము హెచ్చరించారు. యుటిఎఫ్ ఆధ్వర్యాన చేపట్టిన రణభేరి కార్యక్రమం బుధవారం బొబ్బిలిలోని ఎంపిడిఒ కార్యాలయం వద్ద ప్రారంభమైంది. అక్కడి నుంచి రామభద్రపురం, గజపతినగరం మీదుగా విజయనగరం చేరుకుంది. అనంతరం ఎస్.కోటలోని దేవి బొమ్మజంక్షన్‌లో ముగింపు సభ జరిగింది. రణభేరి జాతాకు ఉపాధ్యాయులు ఆయా కేంద్రాల్లో స్వాగతం పలికారు. విజయ నగరంలోని కస్పా, కంటోన్మెంట్ హైస్కూళ్లల్లో రణభేరి సభ జిల్లా అధ్యక్షులు కె శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నాశనం చేస్తున్నా యన్నారు. 15 నెలలు అవుతున్నా ఇచ్చిన హామీలు కూటమి ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయు లకు చెప్పిన అనేక అంశాలు పట్టించుకోవడంలేదన్నారు. బోధనకు పరిమితం చేస్తామని చెప్పి, రివర్సు పిఆర్‌సి ఇచ్చిన ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చిన కూటమి పాలకులు చెప్పిన మాటలకు, చేష్టలకు పొంతన లేదన్నారు. గత ప్రభుత్వం కంటే వేగంగా విద్యా రంగంలో సంస్కరణలు కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. యాప్ లు రద్దు చేస్తామని చెప్పి 60 యాప్ లు ఒకే యాప్ కిందకు తెచ్చి ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. యాప్‌లు వలన విద్యార్థులకు ఏమి ఉపయోగమని వారు ప్రశ్నించారు. ప్రభుత్వ విధానాలు కారణంగా ప్రతి ఏటా రెండు నుంచి మూడు లక్షల మంది విద్యార్థులు తగ్గిపోతున్నారని అన్నారు. వేలాది సంఖ్యలో ఉపాధ్యాయులు తగ్గిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలు బాధ్యత మీది,మీ బాధ్యత మాది అన్న ముఖ్యమంత్రి ఉపాధ్యాయులకు ఏమి చేశారని ప్రశ్నించారు. మంచి పిఆర్‌సి ఇస్తామని చెప్పి ఇవ్వలేదని, నాలుగు డిఎలు బకాయి ఉందని తెలిపారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అన్నారు అందులో తాము లేమా అని ప్రశ్నించారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించవద్దని, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డిఎ చెల్లించి పిఆర్‌సి కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఐఆర్ 30శాతం ప్రకటించాలని కోరారు.ఈ డిమాండ్ల సాధనకు రణభేరి కార్యక్రమంతో అన్ని ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని పెద్దఎత్తున ఉద్యమిస్తామన్నారు. రణభేరి ముగిసిన తర్వాత సెప్టెంబర్ 25న విజయవాడలో రాష్ట్ర చైతన్య సదస్సు జరుగనుందన్నారు. ఆ సదస్సు ద్వారా ప్రభుత్వానికి అల్టిమేటం ఇవ్వనున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, సీనియర్ నాయకులు డి.రాము, గౌరవాధ్యక్షులు మీసాల అప్పలనాయుడు, జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమేష్ చంద్ర పట్నాయక్, కిశోర్, రమేష్, పార్వతీ, ఆయా మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎస్.కోటలోని దేవిబొమ్మ జంక్షన్ వద్ద యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జిబి రమణ అధ్యక్షతన నిర్వహించిన రణభేరి జాత ముగింపు సభలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు కిషోర్ కుమార్, ఎస్ మురళీమోహన్ మాట్లాడారు. రాష్ట్ర కౌన్సిలర్ జి.వెంకట్రావు, తిరుపతి నాయుడు, త్రినాధరావు మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విజయనగరం కస్పాస్కూలులో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు



బొబ్బిలిలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు రెడ్డి మోహనరావు

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ క్రీడా పోటీలకు 9 మంది ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 11న సర్ విజ్జి స్టేడియంలో జరిగిన స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ ఫెన్సింగ్ క్రీడా పోటీల్లో గంట్యాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బాలురు నలుగురు, బాలికలు ఐదుగురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 19 విభాగంలో పెద్ది లిఖిత, కోటంశెట్టి యామిని, ఎస్ రాజు, సూర్య భాస్కర రావు, అండర్ 17 విభాగంలో దేవకి నందన్, డి. రామలక్ష్మి, ధనికొండ జ్యోతి, రఘుమండ ప్రసన్న, అండర్ 14 విభాగంలో రాళ్లపూడి కోదండ శ్రీరామ్ ఎంపికయ్యారు. వీరితోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు పివిఎస్ఎన్ రాజును పాఠశాల హెచ్ఎం అలమండ ఝాన్సీ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

విద్యుత్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యుత్తు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు బుధవారం స్థానిక విద్యుత్ భవన్ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయం లో ధర్నా నిర్వహించారు. డిఎ భాకాయిలు వెంటనే విడుదల చేయాలని, పిఎఫ్ నుంచి జిపిఎఫ్ అమలు చేసి అందరికీ పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరారు. అంతేకాకుండా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరేషన్, ఎనర్జీ అసిస్టెంట్ల రెగ్యులరేషన్ అండ్ ప్రమోషన్, ఉద్యోగాలకు పూర్తి వైద్య సదుపాయాలు, ట్రాన్స్‌కో నిర్వహిస్తున్న సబ్ స్టేషన్ లను ప్రైవేట్ వారికి అప్పగించరాదని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ధర్నాలో ఎపి పవర్ జెఎసి జిల్లా చైర్మన్ సురగాల లక్ష్మణ్ , కన్వీనర్ బండారు రాజేష్ కుమార్ కో. చైర్మన్ పప్పుల అప్పలస్వామి నాయుడు, వైస్ చైర్మన్ మందపల్లి నిర్మలా మూర్తి, రుంకానా అప్పల నాయుడు, పూసపాటి సీతారామరాజు, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైద్యుల సలహా మేరకే మందులు వాడాలి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

వైద్యుల సలహా మేరకే మందులు వాడాలని ప్రభుత్వ మెడికల్‌కళాశాల ప్రిన్సిపాల్ బి.దేవిమాధవి అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల ఫార్మాకాలజీ విభాగం ఆధ్వర్యంలో మహారాజా ప్రభుత్వ బోధనాసుపత్రి ప్రాంగణంలో 5వ జాతీయ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది, విద్యార్థులకు ఔషధాల వలన వచ్చే ప్రతికూల ప్రభావాలను గుర్తించడం, వాటిని ఎవరికి, ఎలా రిపోర్ట్ చేయాలో అవగాహన కల్పించారు. ఫార్మకాలజీ విభాగాధిపతి డి. అన్నపూర్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీకి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.దేవి మాధవి, ప్రభుత్వ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ రమణి, డాక్టర్ శ్రీధర్, ఆర్ఎంఒ డాక్టర్ సంతోష్, ఫార్మకో విజిలెన్స్ కార్యదర్శి శిరీష తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ వసతిగృహాల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం, బిసి సంక్షేమ గురుకుల పాఠశాల వసతి గృహాలను జిల్లా జడ్జి ఎ. బబిత బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్యా బోధన వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మత్స్యకార పాఠశాలలో మౌలిక వసతులు తరగతి గదులు చాలక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించి వారికి మౌలిక వసతులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట తహాశీల్దార్ కె. శ్రీకాంత్, మండల పరిషత్ ఎఒ సుదర్శనం, సిఐ రామకృష్ణ, వసతి గృహం సంక్షేమాధికారులు ఉన్నారు.

సబ్ జైలును సందర్శించిన జిల్లా జడ్జి

చీపురుపల్లి : స్థానిక సబ్ జైలును జిల్లా జడ్జి బబిత బుధవారం సాయంత్రం సందర్శించారు. అక్కడ ఉన్న ఖైదీల వివరాలు, వారికి కల్పిస్తున్న సౌకర్యాలపై జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరంచీపురుపల్లి కోర్టును పరిశీలించారు. నూతనంగా చేపట్టనున్న కోర్టు స్థలాన్ని జిల్లా జడ్జి పరిశీలించారు. జిల్లా జడ్జితోపాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం మానుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి-విజయనగరంకోట

నగరపాలక డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి కూటమి ప్రభుత్వంపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని మానుకోవాలని టిడిపి నాయకులు అన్నారు. బుధవారం టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో టిడిపి నాయకులు గంటా రవి మాట్లాడుతూ మెడికల్ కళాశాలను సందర్శించి ఏదో చేసినట్టు కేకులు కట్ చేసుకుని అసత్య ప్రచారాలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. పిపిపి విధానం అంటే ఏమిటో ముందు తెలుసుకోవాలని అన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు పిపి విధానాన్ని తీసుకొచ్చి పబ్లిక్ ప్రైవేట్ సెక్టార్‌తో త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తేవడానికి కృషి చేస్తున్నారన్నారు. 18 నెలల్లో నే హాస్పిటల్ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఆనాడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 2001 మార్చిలో 17 కళాశాలకు శంకుస్థాపన చేసి 2023 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని ప్రకటించారు కానీ వాస్తవంగా ఏడు కళాశాలలు మాత్రమే ప్రారంభించారని అన్నారు. గొలగాన సురేంద్ర మాట్లాడుతూ ఎలాగైనా కూటమి ప్రభుత్వంపై బురద చల్లారని ప్రజలకు అబద్ధాలు చెబుతూ అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. రూ.500కోట్లు ఖర్చు పెట్టామని చెబుతున్నారని, అంత నిధులు కేటాయిస్తే ఎందుకు పూర్తికాలేదని ప్రశ్నించారు. ఈవిషయమై చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.


మహిళల ఆరోగ్యాన్ని పరిరక్షిద్దాం : ఎమ్‌పి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మహిళలు ఆరోగ్యకరంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం సృష్టించబడుతుందని అన్నారు. మహిళల ఆరోగ్యాన్ని పరిరక్షించే లక్ష్యంతో దేశవ్యాప్తంగా స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ (ఎస్ఎన్ఎస్‌పిఎ) కార్యక్రమాన్ని ప్రధాని మోడీ మధ్యప్రదేశ్‌లో ప్రారంభించారు. స్థానిక ఘోషా ఆసుపత్రిలో ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం అనంతరం, ఎస్ఎన్ఎస్‌పిఎను ఎంపి కలిశెట్టి అప్పల నాయుడు, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ అభివృద్ధికి పునాది మహిళా ఆరోగ్యమని, ఆరోగ్యవంతమైన మహిళ ఒక శక్తివంతమైన కుటుంబానికి, సమాజానికి మూలస్తంభమని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా శిశు సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమాలను గ్రామీణ స్థాయిలో మరింతగా నిర్వహించి సమాజం దృఢంగా ఎదగడానికి కృషి చేయాలని కోరారు. పోషణ్ మహా కార్యక్రమాన్ని సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 16వరకు నిర్వహిస్తారని తెలిపారు. జెసి ఎస్. సేతు మాధవన్ మాట్లాడుతూ మహిళల వైద్య పరీక్షలు, పోషకాహారంపై మరింత శ్రద్ధ పెట్టాలని అన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్ఎంఒ డాక్టర్ బి.మీనాక్షి, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ ఎస్.జీవనరాణి, ఐసిడిఎస్ పీడీ విమలారాణి, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ వివిబి సుబ్రమణ్యం, డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీరాణి, ఎన్ఎల్ఇపి కన్సల్టెంట్ సత్యవతి, డాక్టర్ సుజాత తదితర వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గర్భిణులకు చీర, పండ్లు అందజేస్తున్న ఎంపి కలిశెట్టి



విశ్వకర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెసి, డిఆర్ఒ, అధికారులు

సృష్టికర్త, శిల్పకళా నిపుణులు విశ్వకర్మ

జాయింట్ కలెక్టర్ ఎస్. సేతు మాధవన్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

నైపుణ్యం కలిగిన వృత్తి నిపుణులకు సమాజంలో ఎల్లప్పుడూ విశేష గౌరవం ఉంటుందని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా జరిగిన విశ్వకర్మ జయంతి వేడుకలలో పాల్గొన్న జెసి ముందుగా విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రపంచానికి సృష్టికర్త, శిల్పకళా నిపుణుడు, వాస్తుశాస్త్ర పితామహుడు గా గౌరవింపబడే విశ్వకర్మ మహర్షి స్ఫూర్తి మనందరికీ మార్గదర్శకం అని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, శిల్పకళ, వృత్తి పరమైన నైపుణ్యాలకు విశ్వకర్మ ఆరాధన ఎంతో ప్రేరణనిస్తుందన్నారు. జిల్లా అభివృద్ధిలో కార్మికులు, శిల్పులు, వత్తిదారుల పాత్ర అమోఘమని, వారి శ్రమ, కృషి, ప్రతిభతోనే సమాజం సుస్థిర అభివృద్ధి సాధిస్తోందని వివరించారు. కార్యక్రమంలో డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, జిల్లా బిసి సంక్షేమాధికారి జె.జ్యోతిశ్రీ, డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, బిసి సంక్షేమశాఖ అధికారులు, హాస్టల్ వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు. సంఘ నాయకులు కిల్లంపల్లి ఆచారి, బంగారు దేముడు, మారోజు శ్రీనివాసరావు, తదితరులు తమ సమస్యలను వివరించారు.

గురజాడ జయంతిని రాష్ట్ర పండగగా ప్రకటించాలి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజా చైతన్యం కోసమే అద్భుత రచనలు చేసి ఆధునిక తెలుగు సాహిత్యానికి సరికొత్త రూపం ఇచ్చిన మహాకవి గురజాడ అప్పారావు 163 వ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్వహించాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం జిల్లా పౌర వేదిక, పలు సంఘాల ప్రతినిధులతో కలిసి గురజాడ అప్పారావు విగ్రహం వద్ద శాంతి దీక్ష చేపట్టారు. గురజాడ ఇంటి వద్ద ముందుగా ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు వావిలాల గోపాలకృష్ణయ్య 119 వ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులులు అర్పించారు. అనంతరం ర్యాలీ గా గురజాడ విగ్రహం వద్దకు చేరుకొని దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రముఖుల జయంతి, వర్ధంతిలను రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు జీవోతో పాటు జాబితా విడుదల చేసిందని, అందులో గురజాడ పేరు లేకపోవడం దేశప్రజలనే దిగ్భ్రాంతికి గురి చేసిందని అన్నారు. సెప్టెంబర్ 21న గురజాడ 163 వ జయంతికి ముందే రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన చెయ్యాలని కోరారు. దీక్ష లో సాహితీవేత్త జక్కు రామకృష్ణ, జెవివి నాయకులు చీకటి దివాకర్, ఎమ్.వి.ఎన్. వెంకటరావు, డాక్టర్ ఎమ్.వెంకటేశ్వరరావు, ధవళ సర్వేశ్వరరావు, డాక్టర్ బిఎ రావు, గురజాడ ఇందిర,వెంకటేశ్వర ప్రసాద్, లలితా, దవడ కొండబాబు, దవడ మీనా, పిడకల ప్రభాకరరావు,గెద్ద చిరంజీవి, త్యాడారామకృష్ణ, తుమ్మగంటి రామ్మోహన్‌రావు, మమ్ముల తిరుపతిరావు పాల్గొన్నారు.



గురజాడ విగ్రహం వద్ద దీక్ష చేస్తున్న పలు సంఘాల నాయకులు

ఎఆర్ డిఎస్‌పిగా కోటిరెడ్డి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ఆర్మ్‌డ్ రిజర్వు డిఎస్‌పిగా ఇ. కోటిరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. పలువురు పోలీసు అధికారులు డిఎస్‌పిని మర్యాద పూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం, ఎఆర్ అడిషనల్ ఎస్‌పి జి. నాగేశ్వరరావు, ఎఎస్‌పి పి.సౌమ్యలతను మర్యాద పూర్వకంగా కలిశారు. 1996లో పోలీసుశాఖలోని ఆర్మ్‌డ్ రిజర్వు విభాగంలో ఆర్ఎస్ఐగా ఎంపికైన కోటి రెడ్డి 2008లో రిజర్వు ఇన్‌స్పెక్టర్‌గా, 2022లో డిఎస్‌పిగా ఉద్యోగోన్నతులు పొందారు. విధుల్లో కనబర్చిన ప్రతిభకుగాను డిఎస్‌పి కోటిరెడ్డి వివిధ సందర్భాల్లో 54 క్యాష్ రివార్డులు, 56 జిఎస్ఇలు, 25 కమెండేషన్స్, 2012లో ఎపి పోలీసు సేవా పతకం, 2021లో ఎపి పోలీసు ఉత్తమ సేవా పతకం, 2024 లో ప్రెసిడెంట్ పోలీసు మెడల్ పొందారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న డిఎస్‌పి కోటిరెడ్డి

సిరిమాను చెట్టుకు పూజలు

ప్రజాశక్తి-గంట్యాడ, విజయనగరం టౌన్

విజయనగరం పైడితల్లి అమ్మవారి సిరిమాను చెట్టును గంట్యాడ మండలం కొండ తామరాపల్లి గ్రామంలో బుధవారం ఉదయం బొట్టు పెట్టే కార్యక్రమం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కొండతా మరపల్లికి చెందిన చల్లా అప్పలనాయుడు, నారాయణ మూర్తి, రామకృష్ణ కల్లంలో ఇరుసుమాను గుర్తించారు. ఈనేపథ్యంలో సిరిమానుకు బొట్టు పెట్టే కార్యక్రమాల్లో పైడితల్లి అమ్మవారి దేవస్థానం సహాయ కమిషనర్ శిరీష, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, పూజారి బంటుపల్లి వెంకటరావు, ఆలయ పండితులు, భక్తులు పాల్గొన్నారు.

21న అథ్లెటిక్స్ జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 27 నుండి 29వ తేదీ వరకు ఏలూరు జిల్లా ఎఎస్ఆర్ స్టేడియంలో జరగబోవు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక ఈనెల 21న ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుండి విజ్జీ స్టేడియంలోజరుగుతుందనిజిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు లీలాకుమార్,శ్రీకాంత్ , నాయకులు ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. 14,16,18, 20 సంవత్సరాల బాల బాలికలకు రన్స్, త్రోస్, జంప్‌లో ఎంపికలు ఉంటాయని తెలిపారు. 14ఏళ్ల వారు బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు తో 16ఏళ్ల పైబడిన వారు బర్త్ సర్టిఫికెట్ , పదో తరగతి సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో హాజరుకావాలని తెలిపారు.

20న రామాయణ శంఖారావం

ప్రజాశక్తి- విజయనగరంకోట

ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణం ప్రాంగణంలో ఈనెల 20న శ్రీ రామాయణ శంఖారావం కార్యక్రమంలో భాగంగా జాతీయస్థాయి లీగల్ కాంక్లేవ్ నిర్వహిస్తున్నామని ఎన్‌సిఎస్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్ పేర్కొన్నారు. వాల్మీకి రీసెర్చ్ సెంటర్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆహ్వాన ప్రతులను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 20న వాల్మీకి రీసెర్చ్ సెంటర్లో ఏర్పాటు చేసిన సదస్సుకు తెలంగాణ హైకోర్టుకు చెందిన జస్టిస్ కె.లక్ష్మణ్ ,జస్టిస్ టి.మాధవిదేవి, జస్టిస్ ఎస్.నంద, తిరుపతి జాతీయ సంస్కృతి విశ్వవిద్యాలయం విసి ప్రొఫెసర్ జిఎస్ఆర్ కృష్ణమూర్తి, దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డి.సూర్య ప్రకాష్ రావు తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశంలో వాల్మీకి రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ హెచ్ లజపతిరాయ్, కోఆర్డినేటర్ నారాయణం గౌరీ నిత్య, తవాస్మి అకాడమీ శ్రీరామ చక్రధర్ ,డైరెక్టర్లు శారదా దీప్తి ,జాహ్నవి రెడ్డి, మేనేజర్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.


రైతులకు పలు సూచనలు చేస్తున్న ఉద్యానశాఖ అధికారి ఉమాభరణి

ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం

ప్రజాశక్తి- భోగాపురం

ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం సంపాదించవచ్చునని ఉద్యానశాఖ అధికారి బి.ఉమా భరణి అన్నారు. మండలంలోని ముంజేరు గ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో బుధవారం పతంజలి ఆయిల్ పామ్ కంపెనీ సహకారంతో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయిల్ పామ్ పంట ఎలా పండించాలో చెబుతూ సాగులో గల మెలకువలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ నెల నుంచి కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా ఆయిల్ పామ్ మొక్కలను పంపిణీ చేస్తామన్నారు. ఒక్కో హెక్టారుకు గరిష్టంగా రూ.29వేలు వరకు సబ్సిడీ లభిస్తుందని, మొదటి నాలుగు సంవత్సరాలపాటు అంతర పంటల సాగు, పంట నిర్వహణ కోసం ప్రతి హెక్టారుకూ రూ.10,500 సబ్సిడీ అందిస్తారని వివరించారు. నీటి సదుపాయం ఉన్న రైతులు మాత్రమే కాకుండా చిన్న, సన్నకారు రైతులు కూడా ఆయిల్ పామ్ సాగు చేసుకోవచ్చని సూచించారు. ఎకరా పంటకు రూ.లక్ష నుంచి రూ. 1.30లక్షలు నికర ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. మొదటి నాలుగు సంవత్సరాలలో మొక్కజొన్న, పత్తి, కూరగాయలు, అరటి, బొప్పాయి వంటి అంతర పంటలు వేసుకుంటే అదనపు ఆదాయంతో పాటు సబ్సిడీ ప్రయోజనం కూడా పొందవచ్చని సూచించారు. ప్రస్తుతం ఆయిల్ పామ్ టన్ను ధర రూ.19,095గా ఉన్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎహెచ్‌ఒ చందన, పతాంజలి పరిశ్రమ ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలుంటే చెప్పండి: కర్రోతు

భోగాపురం: సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని మార్క్‌ఫెడ్ చైర్మన్, టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో బుధవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఆదేశాలు ప్రకారం గ్రీవెన్స్ నిర్వహించి వినతులు స్వీకరిస్తున్నామన్నారు.

రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛ భారత్

బొబ్బిలి: స్థానిక రైల్వే స్టేషన్‌లో బుధవారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. రైల్వే స్టేషన్ పరిసరాలను ఆర్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ చంద్ర పాండా, సిబ్బంది శుభ్రం చేశారు. రైల్వే స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని సిబ్బందితో ప్రతిజ్ఞ చేపించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాలలో చెత్త వేస్తే చర్యలు

బొబ్బిలి: బహిరంగ ప్రదేశాలలో చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి హెచ్చరించారు. పట్టణంలోని పూల్‌బాగ్ అపార్ట్మెంట్‌లో నివాసముంటున్న వారు చెరువులు, ఖాళీ స్థలాల్లోచెత్త వేస్తున్నట్లు సమాచారం రావడంతో ఆయా ప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. చెరువులు, ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే జరిమాన విధించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీను ఆదేశించారు. పారిశుధ్య కార్మికులకు చెత్త ఇవ్వాలని కోరారు. ఆమెతో శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేత

చీపురుపల్లి: పేదల పక్షపాతి టిడిపి అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న 17 మందికి సిఎం రిలీఫ్ పండ్ ద్వారా మంజూరైన రూ.10,86,295ల చెక్కలను ఆయన లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నామన్నారు. అర్హులైన పేదలకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

గణిత ఎస్‌ఆర్‌పిలుగా ఇద్దరు

నెల్లిమర్ల: కొత్తగా నియమితులైన ఉపాధ్యాయుల కోసం నిర్వహించే ఇండక్షన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌కి రాష్ట్ర రీసోర్స్ పర్సన్‌లుగా జిల్లా నుంచి గణిత ఉపాధ్యాయులు శివుకు బంగారయ్య, సత్యనారాయణలు ఎంపికయ్యారు. అమరావతి విఐటి యూనివర్సిటీలో 3 రోజులు పాటు వీరు కొత్తగా చేరనున్న ఉపాధ్యాయులకు లీప్ యాప్ నిర్వహణ, టీచర్ హ్యాండ్ బుక్ వినియోగం, స్టూడెంట్ అసెస్మెంట్ బుక్ నిర్వహణ, బోధనా పద్ధతులు, పాఠ్య ప్రణాళిక తరగతి గది నిర్వహణ, విద్యార్థి కేంద్రిత బోధన, ఐసిటి వినియోగం, మూల్యాంకన విధానాలు, ఎన్‌ఈపి 2020, ఎన్‌సిఎఫ్ 2022 మార్గదర్శకాలపై మార్గనిర్దేశం చేయనున్నారు. వీరిలో బంగారయ్య జరజాపుపేట ఉన్నత పాఠశాలలో పనిచేయగా సత్యనారాయణ సారిపల్లి పాఠశాలలో పనిచేస్తున్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగింపే ధ్యేయం

పూసపాటిరేగ: సముద్ర తీర ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాలే తొలగింపు ధ్యేయంగా స్వచ్ఛ సాగర్, సురక్షిత సారగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఇంన్కొసిస్ (ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఇన్ఫర్మేషన్ సెంటర్) శాస్త్రవేత్త డాక్టర్ పి.సునీత తెలిపారు. బుధవారం మండలంలోని చింతపల్లి సముద్ర తీరంలో మత్స్యకార సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సాగర తీరం సుభ్రం చేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సముద్ర తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరీ డస్ట్‌బిన్‌లో వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలను వాడడం వల్ల సముద్ర జీవులతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి సర్పంచ్ బర్రి ముసలి, మత్స్యకార సొసైటీ జిల్లా అధ్యక్షులు బర్రి చినపన్న, మత్స్యకార నాయకులు మైలిపల్లి సింహాచలం, మత్స్యశాఖ ఎఫ్‌డిఒ ఎ.శ్రీనివాస్, మెరైన్ ఎస్ఐ శ్రీనివాస్, మెరైన్ పోలీసులు, విఎఫ్‌ఎ పి.లలిత వాణి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.వెంకటరావు, జి.అప్పలరాజు, ఎంఎంఎస్ జిల్లా అధ్యక్షులు, ట్రీ ఫౌండేషన్ సభ్యులు, సాగర మిత్ర సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిల విడుదలకు చర్యలు తీసుకోండి

విజయనగరం టౌన్ : ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు రావాల్సిన ఆర్థిక బకాయిల విడుదలకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శవన్నగారి బాలాజీ ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా సభ్యత్వ అభియాన్ లో భాగంగా బుధవారం జిల్లాలో గల వివిధ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఇ. రామునాయుడు మాట్లాడుతూ 223 జీవో రద్దుచేసి ఉపాధ్యాయులకు గతంలో ఉన్న విధంగా జూనియర్ కళాశాలలో 40 శాతం జెఎల్ ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. జిల్లా అధ్యక్షులు కొవ్వాడ శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బల్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొల్లాయివలస విఆర్‌ఒపై దాడికి యత్నం

పూసపాటిరేగ: మండలంలోని కొల్లాయివలస విఆర్ఒ అట్టాడ రామునాయుడుపై ఆ గ్రామానికి చెందిన టిడిపి నాయకులు దౌర్జన్యం చేయడంతో విఆర్ఒ స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం ఫిరాయదు చేశారు. కొల్లాయివలస గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దువ్వు అప్పలస్వామి బంధువుల పేరిట మ్యూటేషన్ పెట్టడంతో దానికి సంబంధించిన రిజిష్టర్ డాక్యుమెంట్లు అప్పటికే వుండటంతో మ్యూటేషన్‌ను విఆర్ఒ తిరస్కరించారు. దీంతో మాజీ సర్పంచ్ దువ్వు అప్పలస్వామి ఆయన తమ్ముడు దువ్వు నర్సన్న బుధవారం కొల్లాయివలస సచివాలయంలో వున్న విఆర్ అట్టాడ రామునాయుడుపై దౌర్జన్యం చేయడంతో పాటు బెదిరించి దాడికి దిగినట్లు విఆర్ఒ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తప్పుడు మ్యూటేషన్ చేయాలని గత కొంత కాలంగా ఒత్తిడి తీసుకు వచ్చినట్లు తెలిపారు. అధికారుల ఆదేశాలు మేరకు తిరస్కరిస్తే దాడికి తెగబడినట్లు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్

బొబ్బిలి: ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. వేగావతి నది నుంచి ఎటువంటి అనుమతులూ లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లపై బుధవారం రెవెన్యూ సిబ్బంది దాడి చేసి స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ ఎం.శ్రీను హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణాపై నిఘా పెట్టామని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక ట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అ'ధనం' ఏమైనట్టు?

◆ భవన నిర్మాణానికి సేకరించిన సొమ్ము స్వాహా! ◆ మధ్యలో నిలిచిపోయిన అదనపు భవన నిర్మాణ పనులు ◆ పెదవి విరుస్తున్న దాతలు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

నెల్లిమర్ల తహశీల్దార్ కార్యాలయంలో సమావేశాలు నిర్వహించుకోవడానికి గదులు చాలడం లేదన్న భావనతో పైన అదనంగా భవనం నిర్మించాలని అధికారులు భావించారు. దీంతో ప్రభుత్వానికి నివేధిక పెట్టినా నిధులు మంజూరు కాకపోవడంతో మండలంలో ఉన్న ప్రజాప్రతినిధులను ఆశ్రయించారు. దీంతో చాలా మంది దాతలు ముందుకు వచ్చి వారికి చేతనైన సాయం చేశారు. కొంత మంది ఇసుక, మరికొంత మంది ఇనుము, ఇంకొంత మంది నగదు సాయం చేశారు. దీంతో అధికారులు పనులు ప్రారంభించారు. కానీ పూర్తి చేయలేదు. డబ్బులు మొత్తం దండేసి అధికారులు వాటాల రూపంలో పంచుకున్నట్లు తెలిస్తోంది. దీంతో నిధులు లేక మళ్లీ అదనపు భవన నిర్మాణం ఆగిపోయింది. దీంతో సాయం అందించిన దాతలు పెదవి విరుస్తున్నారు.

స్థానిక తహశీల్దార్ కార్యాలయం అదనపు భవనం నిర్మాణం పనులు గత కొంతకాలంగా నిలిచిపోయాయి. గతంలో నిర్మించిన తహశీల్దార్ కార్యాలయం సమావేశాలకు, ఇతర కార్యక్రమాలు చేపట్టడానికి చాలక పోవడంతో ఇప్పుడు ఉన్న కార్యాలయంపై మరొక్క గది నిర్మాణం చేయడానికి నిర్ణయం తీసుకొని, రెండు సంవత్సరాల క్రితం దాతలు నుంచి సొమ్ము సేకరించి నిర్మాణం పనులు మొదలు పెట్టారు. గోడలు స్థాయిలో నిర్మాణం జరిగినప్పటికీ గత కొన్ని నెలలుగా నిర్మాణం పనులు నిలిచిపోయాయి. కాగా దాతల దగ్గర నుంచి సేకరించిన డబ్బులు, ఇసుక, పిక్క, ఇనుము, కొంత మంది దుర్వినియోగం చేయడంతో నిర్మాణం పనులు నిలిచిపోయాయని విశ్వసనీయ సమాచారం. దాతలు ఇచ్చిన సొమ్మును ఇటీవల రిటైర్ అయిన తహశీల్దారు, ఇది వరలో పని చేసి ఈ మధ్యనే బదిలీ అయిన డిప్యూటీ తహశీల్దారు, ఇదే కార్యాలయంలో పని చేసి బదిలీ అయిన విఆర్ఓలు దుర్వినియోగం చేసినట్లు తెలిస్తోంది. అప్పట్లో ఆనోటా, ఈనోటా దాతలు కొందరు అంటుంటే జిల్లా అధికారులు చెవిలో పడటంతో విషయం బయటకు వచ్చింది.


తహశీల్దార్ కార్యాలయం పై అంతస్తులో మధ్యలో నిలిచిపోయిన అదనపు భవన నిర్మాణం

దీంతో జిల్లా అధికారులు ఈ మధ్యనే అధికారులందరినీ బదిలీ చేసేసినట్లు సమాచారం. దాతలు ఇచ్చిన నగదుతో అదనపు భవనం పూర్తయి సమస్య తీరుతుందని అనుకున్న సమయంలో దాతలు ఇచ్చిన నగదు ఏమయ్యిందో తెలియని పరిస్థితి ఏర్పడిందని, ఆ నగదను దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకుని అదనపు భవనాన్ని పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి: ఎంఇఒ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

స్థానిక ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రంలో నిర్వహించే ఫిజియోథెరపీ కార్యక్రమాన్ని మండల వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ బి.పాపినాయుడు కోరారు. బుధవారం భవిత కేంద్రంలో నిర్వహించిన ఫిజియోథెరపీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లలోపు శారీరక వైకల్యం, మస్థిస్క పక్షవాతం గల వికలాంగ విద్యార్థులకు ప్రతి బుధవారం భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ప్రైవేట్ సెంటర్లలో ఈ చికిత్స చేయించుకోవడానికి వందలాది రూపాయలు ఖర్చు అవుతుందన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో భవిత కేంద్రంలో అందిస్తున్న ఈసేవ పూర్తిగా ఉచితమని, తల్లిదండ్రులు తమ పిల్లలకు కదలికలకు సంభందించిన సమస్య ఉంటే ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ రమా చంద్రిక, ప్రత్యేక ఉపాధ్యాయులు నడిపేన బంగారునాయుడు, వెంకటేశ్వరరావు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిబ్బంది తీరు మారకుంటే చర్యలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

సచివాలయ సిబ్బంది పనితీరు మారకుంటే చర్యలు తప్పవని ఎంపిడిఒ సతీష్ హెచ్చరించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ జిందాల్ కంపెనీ కోసం రైతులు వద్ద తీసుకున్న భూములలో ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం ఎంఎస్‌ఎం పార్కును ఏర్పాటు చేస్తామని ఆ భూములను సదును చేస్తుందన్నారు. జిందాల్ కంపెనీ కోసం భూములు తీసుకున్నప్పుడు రైతులకు యాజమాన్యం ఇచ్చిన హామీలను



వేపాడ: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

అమలు చేయాలని, జిందాల్ భూములు సంబంధించిన నాలుగు పంచాయతీలలో గ్రామసభలు పెట్టి ముందుగా ఆమోదం పొందాలని, అందుకు ఎంపిటిసిల మద్దతు తెలపాలని కోరగా ఎంపిటిసిలు చేతులెత్తి మద్దతు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ సత్య కిషోర్ మాట్లాడుతూ మండలంలోని జెజెఎం ద్వారా 7 గ్రామాలకు మంచినీటిని అందించేందుకు నిధులు మంజూరయ్యాయన్నారు. చామలాపల్లి సర్పంచ్ సూర్యారావు మాట్లాడుతూ తమ గ్రామంలో ఉన్న 2.80 ఎకరాల దేవుడు మాన్యం భూములను ఒక వ్యక్తి తన పేరున పట్టా పాస్ పుస్తకాలు చేయించుకున్నాడని ఆ భూమిని గ్రామానికి చెందే విధంగా దేవాదాయ శాఖ అధికారి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల కాలంలో బస్సులలో ఆడవారు మగవారిని కొట్టి బయటికి తోసేస్తున్నారని ఆడవాళ్ళ వలె పురుషులకు కూడా బస్సులలో సీట్లు కేటాయించాలని ఆర్‌టిసి అధికారిని కోరారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ దేవాదాయ భూములను 22ఏలో నిషేధిత భూముల జాబితాలో చేర్చునందున ఈ భూములను ఎవరూ రిజిస్ట్రేషన్ చేయించుకోలేరని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎంపిటిసిలు, సర్పంచులకు గౌరవ వేతనం ఇవ్వడం లేదని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బి జెఇ కెవి స్వామి, ఇఏపిఆర్‌డి లక్ష్మి, వివిధ శాఖల మండల అధికారులు, వైస్ ఎంపిపి రమణ, సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఎంపిపి డి.సత్యవంతుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు పాల్గొని సమీక్షించారు.


ఎస్‌కోట: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ, ఎంపిపి

యూరియా కొరతపై పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు వ్యవసాయ అధికారి ఎం. స్వాతి ఇంతవరకు వచ్చిన యూరియా రైతులకు సకాలంలో అందించామన్నారు. త్వరలోనే అవసరమైన ఎరువులు పూర్తిస్థాయిలో వస్తాయని ఆమె తెలిపారు. బానాది గ్రామ పంచాయతీ కార్యదర్శి మూర్తి గ్రామ సచివాలయంలో సమావేశాలు ఏర్పాటు చేయడం లేదని సర్పంచ్ కర్రీ యశోద సభలో ప్రశ్నించారు. దీనికి ఎంపిటిసి గొంప తులసీ స్పందిస్తూ ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న పంచాయతీ భవనం కూడా ప్రభుత్వ ప్రజాధనంతో నిర్మించినదేనని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ రఘురాజా మాట్లాడుతూ మారిక గిరిజనులకు రోడ్డు వేసి ప్రైవేటు కంపెనీకి లాభం చేకూర్చే పనులు చేపడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకునేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, మాజీ డిసిసిబి చైర్మన్ వేచలపు వెంకట చినరామనాయుడు, తహశీల్దార్ రాములమ్మ, కొత్తవలస మార్కెట్ కమిటీ చైర్మన్ చక్కాకుల మల్లు నాయుడు, మండల స్థాయి అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల భద్రతే ప్రధాన లక్ష్యం : ఎఎస్‌పి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

మహిళలు, బాలికల భద్రతే ప్రధాన ధ్యేయమని ఎఎస్‌పి పి.సౌమ్యలత అన్నారు. బుధవారం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో 'లైంగిక వేధింపులు- మహిళల భద్రతపై' విద్యార్థులకు మరియు విశ్వవిద్యాలయం అధ్యాపకులకు, సిబ్బందికి ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళల మొబైల్ ఫోనులో శక్తి యాప్ నిక్షిప్తమై ఉంటే ఆపద సమయాల్లో రక్షణగా ఉంటుందని, ఒక కుటుంబ సభ్యుడు మీకు తోడు ఉన్నట్లేనన్నారు. ఆపద సమయాల్లో శక్తి యాప్ లోని ఎస్.ఓ.ఎస్. బటన్ ను ప్రెస్ చేసినట్లయితే క్షణాల్లో పోలీసు బృందం మీరున్న ప్రాంతానికి చేరుకొని, రక్షణగా నిలుస్తారన్నారు. మహిళ ల భద్రతకు ఈ యాప్‌లో సేఫ్ ట్రావెల్ ఆప్షన్ ఉందని, మహిళలు ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తుల వాహనాలు, ఆటోల్లో ప్రయాణించినపుడు ఈ ఆప్షన్‌ను క్లిక్ చేసి, చేరుకోవాల్సిన ప్రాంతాన్ని నమోదు చేస్తే, వారు సురక్షితంగా గమ్య స్థానానికి చేరుకొనేంత వరకు వారి ప్రయాణం పై పోలీసులు నిఘా పెడతారన్నారు. కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ తంత్రవాహి శ్రీనివాసన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా, యూనివర్సిటీ అంతర్గత ఫిర్యాదుల కమిటీ చైర్మన్ డాక్టర్ పి. శ్రీదేవి మాట్లాడారు. పరిపాలనాధికారి డాక్టర్ ఎన్‌విఎస్ సూర్యనారాయణ, పలు విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

కవ్వింపు చర్యలు మానుకోవాలి

విజయనగరం టౌన్ : నగరంలో ఫ్లెక్సీలు విషయంలో బిజెపి కార్యకర్తలు ఎప్పుడూ లేని విధంగా శాంతి భద్రతలు సమస్యను సృష్టించడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారని, ఇటువంటి కవ్వింపు చర్యలు మానుకోవాలని వైసిపి ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్ అన్నారు. బుధవారం మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పార్టీ ఫ్లెక్సీలపై బిజెపి వారు ఫ్లెక్సీలు కట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మోడీ పేరు చెప్పి దిగజారుడు రాజకీయాలు చేయడం తగదన్నారు. ఇటువంటివి మానుకోవాలని కోరారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

ప్రజాశక్తి - చీపురుపల్లి

విరాట్ విశ్వకర్మ జయంతి ఉత్సవాలు బుధవారం చీపురుపల్లిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చీపురుపల్లిలో గల పాండురంగ స్వామి ఆలయం నుంచి గాంధీ బొమ్మ జంక్షన్, మెయిన్ రోడ్డు మీదుగా ఆంజనేయపురంలో గల బ్రహ్మంగారి ఆలయం వరకు విశ్వకర్మ విగ్రహంతో మేళ తాళాల మధ్య భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బ్రహ్మంగారి ఆలయం ఆవరణలో విశ్వకర్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు జరగనుంది. ఈ సందర్భంగా జరిగిన పూజలలో విశ్వబ్రాహ్మణ సంఘం కుటుంబీకులు, చీపురుపల్లి వైసిపి నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, పతివాడ రాజారావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు, రౌతు కామునాయుడు, తాడ్డి సన్యాసినాయుడు, జనసేన నాయకుడు విసినిగిరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే.!

ప్రజాశక్తి - గరివిడి

పట్టణ బ్రిడ్జిపై వెళ్లాలంటే వాహనదారులు, పాదాచారులు, బ్రిడ్జి కిందన ఉన్న ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆదమరచి వెళితే అంతేనని ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. గరివిడి


ప్రమాదకరంగా ఉన్న వంతెన

పట్టణ వంతెన ఇటు విశాఖపట్నం, అటు పాలకొండ, మెరకముడిదాం, గర్భాంకు ప్రధాన రహదారి. అలాంటి వంతెనపై రోజూ వేల సంఖ్యలో బస్సులు, లారీలు, ట్రక్కులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ప్రయాణిస్తున్నాయి. అలాంటి వంతెన మరమ్మత్తులకు గురైతే పట్టించుకొనే నాథుడే లేరా అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత రద్దీగా ఉన్న వంతెన మరమ్మత్తులకు గురైతే కర్రలతో కట్టి నిలబెట్టడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. మేజర్ పంచాయతీ పైగా పట్టణంలో ఇలాంటి దుస్థితి ఏర్పడితే గ్రామాలలో పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పక్కర్లేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏ క్షణాన తాత్కాలికంగా ఏర్పాటు చేసిన చేసిన కర్రలు విరిగి కింద ఉన్న వారి తలపై పడుతుందో అని ప్రజలు, వాహనదారులు భయభ్రాంతులు చెందుతున్నారు. నష్టం జరిగితే భాద్యులు ఎవరు అని ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

'స్వచ్ఛత'లో భాగస్వామ్యం కావాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యులై పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. బుధవారం బొంకుల దిబ్బ వద్ద స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజారోగ్య సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు, తదితరులతో కలిసి పరిసరాలను పరిశుభ్రం చేసారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతా ఈ సేవా కార్యక్రమాలు నగర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, టిపిఆర్ఒ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిబంధలే మేరకే నిర్మాణాలు చేపట్టాలి

ప్రభుత్వ నిబంధనల మేరకే లేఅవుట్లలో నిర్మాణాలు చేపట్టాలని, లేనియెడల అక్రమ నిర్మాణంగా గుర్తించి తొలగిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఆయన ఆదేశాలతో పావనినగర్‌లో ఒక లే అవుట్‌లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం సడలించాల్సిన స్థలంలో నిర్మాణాలు చేపట్టడానికి ప్రణాళిక సిబ్బంది తొలగించారు.


చెత్తను ఊడ్చుతున్న కమిషనర్, తదితరులు

వర్షం పడితే నరకమే..!

ప్రజాశక్తి - వేపాడ

పేరుకే మండల కేంద్రమైన వేపాడ అభివృద్ధికి నోచుకోవడం లేదు. చిన్న చినుకు పడినా రోడ్లన్నీ బురదమయం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షం కారణంగా రోడ్లపై నీరు నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. రోడ్డు పక్కన ఉన్న ఇళ్లల్లో వర్షం నీటిని దాటుకుని వెళ్లేందుకు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపిల్లలు, వృద్దులు రోడ్డు దాటడానికే భయపడుతున్నారు. వర్షపు నీటిని కట్టడి చేసే సదుపాయాలు లేకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


చెరువును తలపిస్తున్న వేపాడ మండల కేంద్రంలోని రోడ్డు

మహిళల ఆరోగ్యం ముఖ్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రతి కుటుంబంలో మహిళల ఆరోగ్యం ముఖ్యమని మహిళలు కోసం ఏర్పాటు చేస్తున్న ఆరోగ్య శిబిరాలను వారు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. బుధవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 'స్వస్తి నారీ - స్వశక్తి కుటుంబ్ అభియాన్' కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఆరోగ్య సంరక్షణ, కుటుంబ బలం పెంపు లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపడుతున్న స్వస్థ నారీ, సశక్త్ అభియాన్ శిబిరాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వరకు జిల్లాలో పలు ప్రాంతాల్లో ఆరోగ్య శిబిరాలు జరగనున్నాయని మహిళలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ బంగారు సరోజినీ, సిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారి ఎం.తిరుమలదేవి, కమిషన్ టి. జయరాం తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

రామతీర్థం రామస్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే లోకం నాగమాదవి దంపతులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానంలో జరుగుతున్న బ్రహోత్సవాలలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు

కేన్సర్ పట్ల జాగ్రత్తగా ఉండాలి

బొబ్బిలి: కేన్సర్ పట్ల మహిళలు జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్, సిహెచ్‌సి సూపరింటెండెంట్ గేదెల శశిభూషణరావు అన్నారు. స్థానిక ఆసుపత్రిలో బుధవారం స్వస్త్ నారి స్వశక్తి పరివార్ అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యాన్ని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మహిళల్లో రొమ్ము, నోటి, గర్భాశయం కేన్సర్ ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయని, ఎప్పటికప్పుడు కేన్సర్ పరీక్షలు చేసుకోవాలని కోరారు. అనంతరం పౌష్టికాహారాన్ని అంగన్వాడీలు ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో వైద్యులు, మహిళలు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: స్వస్త్ నారి స్వశక్తి పరివార్ అభియాన్ ప్రోగ్రాం ఐసిడిఎస్ ఎస్‌కోట ప్రాజెక్టు కొట్టాం సెక్టార్ ఆధ్వర్యంలో మండలంలోని గోపాలపల్లి గ్రామ సచివాలయంలో బుధవారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొట్టం పిహెచ్‌సి డాక్టర్ లావణ్య మాట్లాడుతూ గర్భిణీ, బాలింతలకు, పౌష్టికాహారం ఆవశ్యకత గురించి, స్త్రీశక్తి గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గోపాలపల్లి సర్పంచ్ ఆడారి మహేశ్వరరావు, వైద్య సిబ్బంది ఉదయ్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ: మహిళలు ఆరోగ్యాలను పరిశీలన చేయడం కోసం ఈనెల 17వ తేదీ నుండి వచ్చేనెల రెండవ తేదీ వరకు పెద్దమజ్జిపాలెం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న గ్రామాలలో స్వస్తి నారి స్వశక్తి పరివార్ అభియాన్ శిబిరాలను నిర్వహిస్తామని డాక్టర్ పల్లవి, సతీష్‌లు అన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒ రాజ్, తిరుపతి, ఈశ్వరరావు, రవి, ఏఎన్ఎంలు పద్మ, వెంకటలక్ష్మి, భూదేవి, ఎంఎల్‌హెచ్పి ఈశ్వరమ్మ, హరీష్, లావణ్య, ఆశాలు గ్రామస్తులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: ఆరోగ్యకరమైన మహిళలు, బలమైన కుటుంబాల కోసం మహిళల సంపూర్ణ ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా భారతదేశ ప్రభుత్వం స్వస్త నారి స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ప్రారంభించిందని పూసపాటిరేగ పిహెచ్‌సి వైద్యాదికారులు ప్రమీలాదేవి, కృష్ణ చైతన్య అన్నారు. బుదవారం మండలంలోని కనిమెళ్లలో 23 మంది వైద్య బృందంతో ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఆరోగ్య శిబిరంలో 122 మంది మహిళలకు స్క్రీనింగ్, రక్త పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో 104 డిస్ట్రిక్ట్ మేనేజర్ విలియం, ఓయి లక్ష్మణరావు, స్థానిక సర్పంచ్ నడిపేన రమణ, స్థానిక నాయకులు నడిపేన రమేష్‌నాయుడు, దుర్గాశి సూర్యారావు, వాళ్ల రామునాయుడు, టంకాల రామోజీ, లంకలపల్లి శ్రీనివాసరావు, లంకలపల్లి గొల్లారావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వేదమని, సూపర్వైజర్ ఆర్ నానమ్మ, ఆరోగ్య సహాయకులు బంగారుబాబు, ఏఎన్ఎంలు, పాల్గొన్నారు.

మెంటాడ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లోకప్రియ ఆధ్వర్యంలో స్వస్తి నారి స్వశక్తి పరివార్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మహిళలు, అంగన్వాడీ, ఆసుపత్రి, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ జి.కల్పన ఈ కార్యక్రమానికి వచ్చిన మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి, గుర్తించిన వ్యాధులకు సంబంధించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ సత్యనారాయణ, టిడిపి సీనియర్ నాయకులు రెడ్డి రాజగోపాల్, ఏఎన్ఎమ్ సంతోషి పాల్గొన్నారు.


నెల్లిమర్ల: ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

బొండపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నెలివాడ గ్రామంలో బుధవారం వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వస్త నారీ స్వశక్త పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని సర్పంచ్ తాళ్ళపూడి కీర్తి ప్రారంభంచారు. మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయ కేన్సర్, హెచ్ బీ పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీబీ, లెప్రాసీ, ఎయిడ్స్ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ రాణి, గ్రామపెద్దలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గరివిడి: స్థానిక పిహెచ్‌సి పరిధిలో స్వస్త నారీ స్వశక్తి అభియాన్ కార్యక్రమం ఎంపిఇప మీసాల విజయలక్ష్మి అధ్యక్షతన వైద్యులు రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. మహిళలకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని వైద్యులు రాజ్యలక్ష్మి తెలిపారు. గర్భిణులకు, బీపీ, షుగర్ ఉన్న వారికి తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు విశ్వేశ్వరరావు, వైద్యులు సాయికిరణ్, చిన్న పిల్లల వైద్యులు ఎన్ సునీల్, రేడియాలజిస్ట్ బి సాయి నందిని తదితరులు పాల్గొన్నారు.